సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 28 । జూన్ । 2024



గ్రేటర్‌కు కొత్త మాస్టర్‌ప్లాన్

గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తామని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు.

- 8లో▸



వస్త్ర నగరికి మహర్దశ పట్టేనా!

జిల్లాలోని గీసుకొండ- సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కేఎంటీపీ అభివృద్ధికి రూ.కోట్లలో నిధులు కావాల్సి ఉంది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

39.8^{0} /24.6^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డోర్నకల్: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష ఆదేశించారు. మండలంలోని చిలుకోడు ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేసి, నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అంబరీష మాట్లాడుతూ.. 19 సంవత్సరాలలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 19 ఏళ్లలోపు 9,557 మంది ఉండగా 9,320 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీహెచ్‌ఎన్‌ఓ మంగమ్మ, సీహెచ్‌ఓ కృష్ణార్జున్‌రావు, ఎస్‌యూఓ వద్దె శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన టీపీఓ సుష్మ

మహబూబాబాద్: మానుకోట మున్సిపల్ టీపీఓగా (టౌన్ ప్లానింగ్ ఆఫీసర్) సుష్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పని చేసిన టీపీఓ నవీన్ ఇటీవల కొత్తగూడెం బదిలీ అయిన విషయం తెలిసిందే. వరంగల్ కార్పొరేషన్‌లో టీపీఓగా పని చేసిన సుష్మ మానుకోటకు బదిలీపై వచ్చారు.

అనుమతి లేకుండా ఆస్పత్రులు నిర్వహించొద్దు



తొర్రూరు: వైద్యశాఖ నుంచి అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహించినా, అర్హతకు మించి వైద్యం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మాతృశ్రీ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు నోటీసులు అందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రిలో ధరల పట్టికను, డాక్టర్ల వివరాలను ప్రదర్శించాలని, అగ్నిమాపక పరికరాలను సమకూర్చుకోవాలని తెలిపారు. అర్హతకు మించి వైద్యం అందిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ప్రయాణికులే ఆస్తి



హన్మకొండ: ఆర్టీసీకి ప్రయాణికులే ఆస్తి.. అని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను అన్నారు. ఆర్టీసీ హనుమకొండ డిపోలో లక్షే లక్ష్యం పై ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన రాత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఎస్సెస్సీ, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు, డిపోలో అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన ఉత్తమ కండక్టర్లు, టిమ్ డ్రైవర్లకు బుధవారం డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎం ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. హనుమకొండ రాంనగర్‌లోని డిపో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది.. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఆర్టీసీ వైపు ఆకర్షితులను చేయాలని సూచించారు. ప్రతి స్టేజీలో కండక్టర్ బస్‌దిగి ప్రయాణికులను సాదరంగా ఆహ్వానించాలన్నారు. ఆక్యుపెన్సీ రేషియో పెంచాలని తెలిపారు. లక్షే లక్ష్యాన్ని సాధించాలని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. సంస్థ పరిరక్షణకు ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ వైపు ప్రయాణికులను ఆకర్షించడంతోపాటు, సమన్వయంతో ఆదాయాన్ని పెంచుకుందామని పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భాను కిరణ్, డిపో మేనేజర్ ధరంసింగ్, అసిస్టెంట్ మేనేజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పనిభారం.. ఒత్తిడి

- విధుల్లో ఆర్టీసీ కార్మికులు సతమతం
- సంస్థలో 14 సంవత్సరాలుగా నియామకాలు కరువు
- సెలవులు కావాలంటే డబుల్ డ్యూటీ చేయాల్సిందే
- లేదంటే అధికారుల కక్షసాధింపు



సాక్షి, మహబూబాబాద్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనిభారంతో ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అయితే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోలేక.. అలాగని విధులకు రాకుండా ఉండలేక డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ కార్మికులు సతమతమవుతున్నారు. మంచిరోజులు వస్తాయని ఎదురుచూపులతోనే సరిపెట్టుకుంటున్నారు.

పెరిగిన పనిభారం

గతంలో పోలిస్తే ఆర్టీసీ కార్మికులపై పనిభారం పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. కాగా గతంలో మహబూబాబాద్, తొర్రూరు బస్ డిపోల పరిధిలో ప్రతీరోజు 40వేల మంది ప్రయాణం చేసేవారు. కానీ ఇప్పుడు ఈ ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అయ్యింది. సగటున రోజుకు 73వేల మంది ప్రయాణం చేస్తున్నారు. దీంతో కండక్టర్ ప్రతీ ప్రయాణికుడితో మాట్లాడటం, ఆధార్ కార్డు చూసి నమోదు చేయడం, టికెట్లు ఇవ్వడం వంటి పని రెట్టింపు అయ్యింది. ఇది డ్రైవర్లపై కూడా ప్రభావం చూపుతోంది. ఎక్కువ లోడ్‌తో బస్సులను నడపడం కష్టంగా మారింది. బస్సులు తరచూగా మరమ్మతులకు గురికావడంతో గ్యారేజీ కార్మికులపై కూడా పని భారం పెరిగింది.

సెలవు పెట్టాలంటే భయం

సొంత పనులు, కుటుంబ అవసరాల కోసం సెలవు పెట్టాలంటే ఆర్టీసీ కార్మికులు భయపడుతున్నారు. సెలవులు కావాలంటే డబుల్ డ్యూటీ చేస్తున్నారు. ఈక్రమంలో పనిభారం పెరిగి అలసిపోతున్నారు. 2010 తర్వాత ఆర్టీసీలో కొత్త ఉద్యోగ నియామకాలు లేవు. అదేవిధంగా వయసుపైబడిన వారు పదవీ విరమణ పొందారు. వారి స్థానంలో కొత్త వారు రాకపోవడంతో.. జిల్లాలోని రెండు డిపోల్లో ఇందుకు అనుగుణంగా డ్రైవర్లు, కండక్టర్లు లేరు. దీంతో ఉన్నవారితోనే బస్సులు నడిపించే పరిస్థితి నెలకొంది. దీంతో డ్రైవర్లు, కండక్టర్లు సెలవు కావాలంటే డబుల్ డ్యూటీలు చేయాలని పలువురు అధికారులు ఒత్తిడి పెంచినట్లు సమాచారం. ఈక్రమంలో డబుల్ డ్యూటీలు చేయమని చెప్పిన వారిపై ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, రెగ్యులర్‌గా చేసే డ్యూటీలు వేయకుండా.. ఇబ్బందికరమైన డ్యూటీలు వేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో డబుల్ డ్యూటీలు చేయడంతో కార్మికులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురవుతున్నారు. దీని మూలంగా పలుమార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

జిల్లాలోని రెండు డిపోల్లో బస్సులు, కార్మికుల వివరాలు

మహబూబాబాద్ డిపో	తొర్రూరు డిపో
బస్సుల సంఖ్య: 66(ఆర్టీసీ : 39, హైయిర్: 25)	బస్సుల సంఖ్య: 93 (ఆర్టీసీ: 51, హైయిర్: 42)
ప్రతిరోజు ప్రయాణికుల సంఖ్య: గతంలో 21వేలు, ప్రస్తుతం 33 వేలు	ప్రతిరోజు ప్రయాణికుల సంఖ్య: గతంలో 20వేలు, ప్రస్తుతం 40వేలు
ఉండాల్సిన కండక్టర్లు: 124, ప్రస్తుతం ఉన్నది: 114	కండక్టర్లు: 170 మందికి 175మంది ఉన్నారు
ఉండాల్సిన డ్రైవర్లు: 84, ప్రస్తుతం ఉన్నది: 84	డ్రైవర్లు: 107 మందికి 120మంది ఉన్నారు
గ్యారేజీ కార్మికులు: 20	గ్యారేజీ కార్మికులు: 66 మంది

సీఎం నేటి వరంగల్ పర్యటన వాయిదా

- రేపు రానున్న రేవంత్‌రెడ్డి
- ఢిల్లీ పర్యటన ముగియకపోవడంతో చివరి నిమిషంలో మార్పు



సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన ఒకరోజు తరువాత వాయిదా పడింది. సీఎం అయ్యాక తొలిసారిగా శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించనున్నట్లు గురువారం సాయంత్రం అధికారిక టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. కానీ ఆయన ఢిల్లీ పర్యటన ముగియకపోవడం, శుక్రవారం అక్కడే ఉండాల్సి ఉండడంతో చివరి నిమిషంలో వరంగల్ పర్యటన వాయిదా వేశారు. శనివారం ఆయన పర్యటన యథావిధిగా కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అంతకుముందు సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు గురువారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గీసుగొండ మండలం శాయంపేటలోని మెగా టెక్స్‌టైల్ పార్క్ సమీపంలో హెలిపాడ్ నిర్మాణంతోపాటు జరుగుతున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మహిళా శక్తి పథకం కింద మహిళలకు సీఎం చేతుల మీదుగా అందించనున్న చెక్కులకు తగిన ఏర్పాట్లు చేయాలని, కొత్తగా నిర్మాణంలో ఉన్న హెల్త్ సిటీ సందర్శనకు సంబంధించిన వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు మెగా టెక్స్‌టైల్ పార్క్‌లోని ఏర్పాట్లను కలెక్టర్, సీపీ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు. భద్రతపై సీపీ సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.

సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలి

గార్ల: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీస్ సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశించారు. గురువారం గార్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో క్రైం రేట్ వివరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మానుకోటను గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, గ్రామాలు, తండాల్లో గుడుంబాను నియంత్రించడంలో పోలీసులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలను సేవిస్తూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మండలంలో గంజాయిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డీఎస్పీ తిరుమలరావు, సీఐ రవికుమార్, ఎస్సై జీనత్‌కుమార్, కానిస్టేబుళ్లు తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ చిత్రామిశ్రా అన్నారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మగూడెం, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలను ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారం, స్వచ్ఛ మైన తాగునీరు అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. పాఠశాలలకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేయాలని, ఆర్వో ప్లాంట్స్ అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్సీఓ రాజ్యలక్ష్మి, జిల్లా గిరిజన ఉపసంచాలకుడు ఎర్రయ్య, ఏటీడీఓ సత్యవతి, హెచ్‌ఎంలు నరసయ్య, యాకలక్ష్మి, హెచ్‌డబ్ల్యూఓ అనిత ఉన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

నిర్లక్ష్యం తగదు..

గూడూరు: గురుకుల విద్యాలయంలో మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. మండలంలోని దామరవంచ గిరిజన బాలుర గురుకుల విద్యాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ముందుగా ఆహార నాణ్యతను పరిశీలించారు. అలాగే కిచెన్ షెడ్, తాగునీటి వసతి, ఆర్‌ఓ ప్లాంట్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు.

11.5 అడుగులకు బయ్యారం చెరువు నీటిమట్టం

బయ్యారం: ఇటీవల కురుస్తున్న వర్షాలతో బయ్యారం పెద్దచెరువులో వరద నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 16.2 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్న చెరువులోకి బుధవారం సాయంత్రం వరకు 11.5 అడుగుల మేర నీరు చేరింది. కాగా చెరువులోకి వస్తున్న నీరు నక్కలతూము వద్ద ఉన్న లీకేజీతో బయటకు వృథాగా వెళ్తుందని, దానిని అరికట్టాలని ఆయకట్టు రైతులు ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు.. వ్యర్థాలు

- మూసుకుపోయిన కొర్లకుంట కాలువ
- వరదొస్తే డోర్నకల్‌లోని పలు కాలనీలకు ముంపు ముప్పు
- మరమ్మతులను పట్టించుకోని అధికారులు

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని కొర్లకుంట కాలువ చెట్లు, పిచ్చి మొక్కలతో మూసుకుపోయింది. చర్చి కాంపౌండ్‌లోని జయపురం శివారులో సర్వే నంబర్ 19లో సుమారు 20 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న కొర్లకుంట కింద దశాబ్దాల కాలం క్రితం భూములు సాగయ్యేవి. ప్రస్తుతం ఆ భూములు సాగులో లేవు. గార్ల మండల పరిధిలోని వడ్లకుంట, శర్మకుంటతో పాటు వ్యవసాయ భూముల నుంచి వచ్చే వరదనీరు కొర్లకుంటకు చేరుతుంది. కుంట నిండిన తర్వాత అలుగు నుంచి జయపురం, రైల్వే కాలనీలు, నెహ్రూస్ట్రీట్ మీదుగా 3 కిలోమీటర్ల మేర ఉన్న కాలువ ద్వారా వరదనీరు పెద్ద చెరువుకు చేరుతుంది. కాగా జయపురం, నెహ్రూస్ట్రీట్ ప్రాంతంలో పెద్ద చెట్లు, చెత్త, వ్యర్థాలు చేరి కాలువ మూసుకుపోయింది. దీంతో వర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.

2005లో వరద బీభత్సం..

2005లో భారీ వర్షాలతో వరద పోటెత్తడంతో కుంటకు గండ్లు పడి వరద ప్రవాహం జయపురం, రైల్వే కాలనీలు, నెహ్రూస్ట్రీట్ తదితర ప్రాంతాలను ముంచెత్తింది. ఇంట్లోని వస్తువులు వరదకు కొట్టుకుపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. నాటి వరదల్లో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. కొర్లకుంట కట్ట పటిష్టంగా లేకపోవడం, పెద్ద చెరువు వరకు ఉన్న కాలువ మూసుకుపోవడంతో వరదనీరు కాలనీలను ముంచెత్తింది.

సంవత్సరం క్రితం సర్వే..

సంవత్సరం క్రితం మున్సిపాలిటీ సిబ్బంది కొర్లకుంట కాలువలో కొంతదూరం వరకు చెట్లను తొలగించి రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశారు. సుమారు రూ.50 లక్షల వరకు వ్యయం అయ్యే అవకాశాలు ఉండటంతో పనులు అటకెక్కాయి. 2017లో మిషన్ కాకతీయ పథకం ద్వారా నామమాత్రంగా పనులు చేసి బిల్లులు కాజేశారు.

వరదొస్తే కాలనీలకు ముప్పు..

కొర్లకుంటలో ఇప్పటికే చాలా భాగం ఆక్రమణకు గురికాగా భారీ వర్షాలతో వరద పోటెత్తితే కట్ట తెగే ప్రమాదం ఉంది. శిథిలావస్థలో ఉన్న కట్ట తూములకు చెట్లను అడ్డుగా వేసి మూసివేశారు. కట్ట నుంచి కాలనీల మీదుగా ఉన్న కాలువ చెట్లు, వ్యర్థాలతో మూసుకుపోయింది. భారీ వరదలు వస్తే 2005 నాటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కాలువలోని పిచ్చి మొక్కలను తొలగించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన కొర్లకుంట తూము



నెహ్రూస్ట్రీట్‌లో మూసుకుపోయిన కాలువ

మరమ్మతులు చేపట్టాలి...



కొర్లకుంట కాలువకు నిధులు కేటాయించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. గతంలో కాలువకు వరద పోటెత్తి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొన్నాం. ప్రమాదకర కాలువపై మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

-గాసుల వేణుగోపాల్, నెహ్రూస్ట్రీట్

నో పర్మిషన్..

- అనుమతి లేకుండా గృహ నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాలతో అధికారులకు కాసుల వర్షం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో ఎలాంటి అనుమతులు లేకుండా గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. కొంత మంది పర్మిషన్ తీసుకొని మరీ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. మరికొంత మంది ఏకంగా కాల్వలు, రోడ్లపై నిర్మాణాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు అధికారులు అక్రమ నిర్మాణదారుల నుంచి అందినకాడికి దండుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా రోడ్లపై అక్రమ నిర్మాణాల వల్ల ట్రాఫిక్‌తో పాటు పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఆదాయానికి గండి..

మానుకోట మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా 68,889 జనాభా, 57,828 మంది ఓటర్లు ఉన్నారు. 25,000పైగా నిర్మాణాలు ఉండగా.. ఇంటి నంబర్లు లేకుండా సుమారు 5,000కు పైగా గృహాలు ఉన్నాయి. కాగా ఎక్కువ సంఖ్యలో అనుమతులు లేకుండా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వాస్తవానికి టీఎస్‌బీపాస్ ద్వారా అనుమతి తీసుకుని 30 ఫీట్ల రోడ్డు ఇతర నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు శివారు కాలనీల్లోని ప్రభుత్వ భూముల్లో జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. నిజాంచెరువు, బంధం చెరువు, కంబాలచెరువు శిఖం భూముల్లో నేటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.



మూడుకొట్ల సెంటర్ సమీపంలో రోడ్డుపైనే చేసిన గృహ నిర్మాణాలు

అనుమతులు ఉన్నా..

కొంతమంది అనుమతులు తీసుకుంటున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి అనుమతులు తీసుకుని జీప్లస్ వన్, జీప్లస్ టు నిర్మాణాలు చేపడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది.

కాల్వలు, రోడ్లపై నిర్మాణాలు

మానుకోట పట్టణంలో కాల్వలు, రోడ్లపై కూడా నిర్మాణాలు చేపడుతున్నారు. ఏ క్యాబిన్ సమీపంలో పలువురు కాల్వలను కూడా వదలకుండా వాటిపై నిర్మాణాలు చేపట్టారు. సూర్య థియేటర్ సమీపంలో రోడ్డు కబ్జా జరుగగా, మూడుకొట్ల సెంటర్ సమీపంలో రోడ్డుపైనే గృహ నిర్మాణాలు చేశారు. కృష్ణకాలనీలో కూడా రోడ్డు కబ్జా చేసి గృహ నిర్మాణం చేశారు. ఇదిలా ఉండగా సెల్లార్ లేకుండా కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు. 600గజాల స్థలంలో నిర్మించే భవనాలకు తప్పనిసరిగా సెల్లార్ ఉండాలి. అయితే మానుకోటలో మాత్రం ఆ నిబంధనలు పాటించడం లేదు. సెల్లార్ ఉన్న భవనాలు 10లోపే ఉన్నాయి. చాలా కమర్షియల్ భవనాలకు సెల్లార్లు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోంది.



ఏ-క్యాబిన్ సమీపంలో కాల్వపై గృహ నిర్మాణాలు, 24వ వార్డు పరిధిలో తీసుకున్న అనుమతికి విరుద్ధం నిర్మాణం చేసిన భవనం

కాసుల వర్షం ..

పలు వార్డుల్లో స్థానిక కౌన్సిలర్ల సహకారంతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అధికారులు వారికి కొమ్ముకాస్తు అందినకాడికి దండుకుంటున్నారు. కొంత మంది మున్సిపాలిటీ సిబ్బంది అదే పనిగా పెట్టుకుని, అక్రమ నిర్మాణాలు చేసినవి, చేస్తున్న వాటి వద్దకు వెళ్లి కూల్చివేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో సదరు వ్యక్తులు అధికారుల వద్దకు పరుగులు పెట్టి పెద్ద మొత్తంలో అప్పగిస్తున్నారు. కాగా 34 వార్డు పరిధిలోని గ్రీన్ ల్యాండ్‌కు ఇటీవల అధికారులు డబ్బులు తీసుకొని గృహ నిర్మాణ అనుమతులు ఇచ్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ నిజాంచెరువుతో పాటు బంధం చెరువును సందర్శించి వాటికి హద్దులు పెట్టాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించినా నేటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం

అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు ముందుగా నోటీసులు ఇస్తాం. తీసుకున్న అనుమతి కంటే ఎక్కువగా నిర్మాణాలు చేస్తే జరిమానా విధించి చర్యలు తీసుకుంటాం. సెల్లార్ లేకుండా నిర్మాణాలు చేసి వాటి విషయంలో నోటీస్‌లు ఇచ్చాం.

-ప్రవీణ్, టీపీఎస్

పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా బావి



ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి పక్కన నుంచి వెళ్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని దామ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చర్లతండా ఎంపీపీఎస్ పక్కనే ఓ వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తుండగా 12 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం విద్యార్థులు ఇదే బావి పక్కన నుంచి పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావి పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉండగా గతంలో ఉపాధ్యాయులు దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించగా గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. కాగా, పాఠశాలలు పునఃప్రారంభమై 15 రోజులు అవుతుండగా పిల్లలు బడికి వచ్చివెళ్తున్న సమయంలో ఉపాధ్యాయులు వారికి జాగ్రత్తగా రావాలని చెబుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బావి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

గంగారం: విత్తన దుకాణాదారులు రైతులకు కకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు అన్నారు. మండలంలోని ఎరువులు, విత్తనాల షాపులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ బోర్డుపై వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు అందజేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఉదయ్, ఏఈఓ ధరణీష్ పాల్గొన్నారు.



విత్తనాల షాపును తనిఖీ చేస్తున్న డీఏఓ

క్లుప్తంగా

వనదేవతల కానుకల లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఎస్‌ఎస్‌తాడ్వాయి : వనదేవతలు సమ్మక్క, సారలమ్మల హుండీల కానుకలను గురువారం మేడారంలోని దేవాదాయశాఖ కార్యాలయం డార్మెటరీ భవనంలో లెక్కించారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ.. పూజారుల సమక్షంలో హుండీల కానుకల లెక్కింపు చేపట్టారు. ఇందులో సమ్మక్క హుండీ ఆదాయం రూ. 21,83,867, సారలమ్మ ఆదాయం రూ. 17,58,83, గోవిందరాజు ఆదాయం రూ. 1,13,998, పగిడిద్దరాజు ఆదాయం రూ. 1,54,954 మొత్తం రూ. 42,10,902 లభించినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఇన్‌స్పెక్టర్‌ అనిల్‌, సూపరింటెండెంట్‌ క్రాంతికుమార్‌, పూజారులు వసంతరావు, ప్రధాన పూజారి అరుణ్‌కుమార్‌, కాక కిరణ్‌, పూజారుల సంఘం ఉపాధ్యక్షుడు చందా గోపాల్‌, సిద్దబోయిన భోజరావు పాల్గొన్నారు

విద్యుదాఘాతంతో రైతు మృతి

● తాళ్లపూసపల్లిలో ఘటన



ప్రకాశ్‌(ఫైల్‌)

కేసముద్రం: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని తాళ్లపూసపల్లిలో జరిగింది. ఎస్సై వంశీధర్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాలేరు ప్రకాశ్‌(48) తన పంట పొలం వద్ద నారుమడికి నీళ్లు పారించేందు స్టార్టర్‌ను ఆన్‌చేయగా మోటార్‌ నడవలేదు. దీంతో మోటార్‌కు కనెక్షన్‌ ఉన్న తీగను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పటికే ఫెయిల్‌ అయిన తీగ అతడి చేతికి తాకింది. దీంతో విద్యుత్‌ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరకుని మృతదేహంపై పడి బోరున విలపించారు. పోలీసులు.. ప్రకాశ్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సరోజన, ఇద్దరు కుమారులు ఉన్నారు.



పార్కులోని పరిశ్రమలు

వస్త్రనగరికి మహర్దశ పట్టేనా!

టెక్స్‌టైల్‌ పార్కు అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 706.87 కోట్లు ఖర్చు

- నిధులన్నీ బీఆర్‌ఎస్‌ సర్కారు కేటాయించినవే
- ఇప్పటి వరకు నిధులు ఇవ్వని ప్రస్తుత కాంగ్రెస్‌ సర్కారు
- త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయిస్తే మేలు
- నిధుల మంజూరుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేస్తారనే ఆశ



గణేశా ఎకోటెక్‌ కంపెనీ

ఓ వైపు.. వస్త్ర ఉత్పత్తి.. మరోవైపు.. చేనేత కార్మికులకు చేతినిండా పని.. ఇంకో వైపు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కాకతీయ మెగా టెక్స్‌టైల్‌(వస్త్ర నగరి) పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే ఈ పార్కు అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు కావాల్సి ఉంది. అప్పుడే పార్కులో మౌలిక వసతులు ఏర్పాటై నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగిన న్ని నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

గీసుకొండ : వరంగల్‌ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్‌ పార్కు(కేఎంటీపీ) అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు కావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత నిధులు కేటాయిస్తేనే పార్కులో మౌలిక వసతుల కల్పన చేయడానికి, తమ యూనిట్లను నెలకొల్పడానికి వచ్చే వస్త్ర కంపెనీలకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. పలు కంపెనీలు ముందుకు వస్తేనే వస్త్రాల ఉత్పత్తితో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. 2017 అక్టోబర్‌ 22న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌.. పార్కు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో 22 కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నాయని అధికారులు తెలిపారు. కరోనా తర్వాత రెండేళ్ల క్రితం నుంచి పనులు పుంజుకున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌ కేంద్రంగా ఉన్న గణేశా ఎకోటెక్‌ కంపెనీ ముందుగా ఏర్పాటై వినియోగించి పడేసిన ప్లాస్టిక్‌ నుంచి దారం(యార్న్‌) తయారు చేస్తోంది. పిల్లల దుస్తుల తయారీకి కేరళ కేంద్రంగా ఉన్న కైటెక్స్‌ కంపెనీకి అప్పటి మంత్రి కేటీఆర్‌ 2022 మే 7న శంకుస్థాపన చేశారు. తర్వాత దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్‌ కంపెనీ ఏర్పాటుకు కేటీఆర్‌ 2023 జూన్‌ 17న భూమిపూజ చేశారు. ప్రస్తుతానికి ఈ రెండు కంపెనీల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

పీఎం మిత్ర నిధులపై ఆశలు..!

ప్రధాని నరేంద్ర మోదీ 2023 మార్చి 17న కేఎంటీపీని 'ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్‌ టెక్స్‌టైల్‌ రీజియన్‌ అండ్‌ అపెరల్‌ (పీఎం మిత్ర)' కింద ఎంపిక చేశారు. దేశంలో పీఎం మిత్ర కింద ఎంపికైన ఏడు మెగా టెక్స్‌టైల్‌ పార్కుల్లో కేఎంటీపీ ఒకటి. బ్రౌన్‌ ఫీల్డ్‌ కింద ఈ పార్కు అభివృద్ధికి తొలి విడతగా కేంద్రం రూ.200 కోట్లు కేటాయించిందని అధికారులు చెబుతున్నా అవి ఇంకా విడుదల కాలేదని తెలుస్తోంది. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సగం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా అవేమీ జరగలేదు. పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్‌ పార్కులు–5 ఎఫ్‌ (ఫామ్‌–ఫైబర్‌–ఫ్యాక్టరీ–ఫ్యాషన్‌–ఫారిన్‌) విధానం ద్వారా జౌళి రంగానికి ఊతం ఇస్తాయని కేంద్రం ప్రకటించింది. పార్కులో తమ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు అనేక రాయితీలు, ప్రోత్సాహకాలను పీఎం మిత్ర ద్వారా అందించే అవకాశం ఉంది.

గత సర్కారు కేటాయించిన నిధులే...

గత బీఆర్‌ఎస్‌ సర్కారు పార్కు అభివృద్ధికి టీఎస్‌ఐఐసీ ద్వారా రూ. 706.87 కోట్లు మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేసింది. ఇందులో రైతుల భూములను పార్కు కోసం సేకరించినందుకు పరిహారంగా రూ. 159.27 కోట్లు ఖర్చు చేశారు. మిగతా రూ. 547.60 కోట్లను మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసినట్లు టీఎస్‌ఐఐసీ అధికారులు తెలిపారు. ఈ నిధులతో 21.50 కి.మీ పొడవులో ప్రహరీ, 13.50 కి.మీ పొడవులో అంతర్గత రోడ్లు, 7.60 కి.మీ పొడవులో వీధి దీపాలు, విద్యుత్‌ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, 12ఎంఎల్‌డీ నీటి సరఫరా, అంతర్గత నీటి సరఫరా, 5 ఎంఎల్‌డీ సీఈటీపీ నిర్మాణం తదితర పనులు చేపట్టారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్‌ సర్కారు వచ్చిన తర్వాత పార్కు అభివృద్ధికి నిధులేవీ మంజూరు చేయలేదని తెలుస్తోంది. త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లోనైనా అధికంగా నిధులు పార్కు అభివృద్ధికి కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి పార్కు పర్యటనకు వస్తున్న సందర్భంగా ఆయన నిధుల మంజూరు విషయమై ప్రకటన చేసే అవకాశం ఉంది.



పార్కులోని అంతర్గత రోడ్డు

పార్కు ప్రోగ్రెస్‌ రిపోర్టు ఇలా...

- పార్కు కోసం 1357 ఎకరాల భూ సేకరణ చేపట్టారు.
- పార్కు ఏర్పాటుకు రూ. 1150.47 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా
- పరిశ్రమ యూనిట్ల ఏర్పాటుకు 1200 ఎకరాలను లేఔట్‌ చేశారు.
- అందులో 539.31 ఎకరాలను పరిశ్రమలకు కేటాయించారు.
- గంగదేవిపల్లి నుంచి ఫోర్‌ లేన్‌తోపాటు చింతలపల్లి రైల్వే స్టేషన సమీపంలో ఆర్‌ఓబీ నిర్మించాల్సి ఉంది.
- గణేశా ఎకో టెక్‌ (ప్లాస్టిక్‌ నుంచి దారం తయారు చేసే) కంపెనీ 50.10 ఎకరాల్లో ఏర్పాటు కాగా రూ. 588.25 కోట్ల పెట్టుబడితో నడుస్తోంది. ఇందులో సుమారు 700 మంది కార్మికులు పని చేస్తున్నారు.
- కైటెక్స్‌ పిల్లల గార్మెంట్ల తయారీ కంపెనీకి 191.62 ఎకరాల భూమిని కేటాయించగా రూ. 1500 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. ఇందులో సుమారు 11 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉండగా ఏర్పాటు పనులు 80 శాతం పూర్తి చేశారు.
- యంగ్‌వన్‌ ఎవర్‌టాప్‌ టెక్స్‌టైల్‌ అండ్‌ అపెరల్‌ కాంప్లెక్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీ (టీ షర్టులు, ట్రాక్‌ సూట్‌లు, జర్కిన్లు, క్రీడా దుస్తులు, షూ తదితర తయారు వస్తువులు)కి 297.59 ఎకరాలు కేటాయించగా రూ. 980 కోట్ల పెట్టుబడితో సుమారు 11,700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఈ కంపెనీ పనులు కొనసాగుతున్నాయి. మహిళలకు కుట్టు శిక్షణ కోసం ట్రైనింగ్‌ సెంటర్‌ ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు.



టెక్స్‌టైల్‌ పార్కు బోర్డు

గంజాయి సాగుదారుడికి పదేళ్ల జైలు

వరంగల్‌ లీగల్‌/పరకాల : వ్యవసాయ భూమిలో మిశ్రమ పంటగా గంజాయి సాగుచేస్తున్న రైతుకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి బి. అపర్ణాదేవి గురువారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ జిల్లా పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన గొట్టె కుమారస్వామి పోచార గ్రామ శివారులో గల తన వ్యవసాయ భూమిలో గంజాయి సాగుచేస్తున్నారని ఎస్సై శ్రీకాంత్‌ రెడ్డికి సమాచారం అందింది. వెంటనే ఉన్నతాధికారులతోపాటు తహసీల్దార్‌కు సమాచారం అందజేసి తన సిబ్బందితో గంజాయి సాగు చేస్తున్న పంట భూమి వద్దకు వెళ్లాడు. రెవెన్యూ సిబ్బంది చేరుకుని భూమిని పరిశీలించి గొట్టె కుమారస్వామి భూమి అని తేల్చి చెప్పారు. పత్తి చేనులో మిశ్రమ పంటగా గంజాయి మొక్కలు పెరిగి ఉన్నాయని గుర్తించారు. పంచుల సమక్షంలో ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలను సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అనంతరం గంజాయి మొక్కలను తొలగించారు. సదర్‌ ఎస్సై ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్‌ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్‌ చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో నేరస్తుడు గొట్టె కుమారస్వామికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. ఈ కేసును పోలీసు అధికారులు జే నర్సింహులు, రవిరాజ్‌ పరిశోధించగా సాక్షులను కే పరమేశ్వరి పర్యవేక్షణలో కానిస్టేబుల్‌ ఎస్‌. సుధాకర్‌ కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ బి. రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

ప్రేమ నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్‌(ఫైల్‌)

పరకాల: ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకోవడానికి పెద్దలు నిరాకరించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం పరకాల మండలం పైడిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండి రాజశేఖర్‌(23) అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో గ్రామంలోని ఇరువర్గాల పెద్దలు మందలించి మరోసారి ఆ యువతి జోలికి రాజశేఖర్‌ వెళ్లొద్దని నిర్ణయించారు. దీనిపై మనస్తాపం చెందిన రాజశేఖర్‌.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనికోసం బయటకు వెళ్లి వచ్చిన తల్లి మంజుల ఇంటి తలుపులు తీసే క్రమంలో రాకపోవడంతో అనుమానంతో కిటికీ నుంచి చూడగా కొడుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో కేకలు వేస్తూ ఇంటి పక్కనవారికి తెలపడంతో బలవంతంగా తలుపులు తొలగించి చూడగా రాజశేఖర్‌ అప్పటికే ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ రవిరాజ్‌ తెలిపారు.

పోక్సో కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

వరంగల్‌ లీగల్‌: 'ప్రేమిస్తున్నాం.. పెళ్లి చేసుకోవాలి' అని తరచూ బెదిరిస్తూ మైనర్లు అయిన అక్కాచెల్లెలను ఎత్తుకెళ్లిన కేసులో నేరం రుజువుకావడంతో హనుమకొండ బొక్కల గడ్డకు చెందిన సోనుసింగ్‌ బాటియా, ఎండీ సమీర్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి గురువారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ బోడెడ్ల రాజమల్లారెడ్డి కథనం ప్రకారం.. హనుమకొండ గుండ్ల సింగారం గ్రామానికి చెందిన అక్కాచెల్లెల్లో ఒకరు ఇంటర్‌, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. తమ స్నేహితురాలి జన్మదిన వేడుకల్లో ఆమె అన్నయ్య (సోనుసింగ్‌), మరో వ్యక్తి (సమీర్‌).. సదరు అక్కాచెల్లెలకు పరిచయమయ్యారు. అనంతరం ప్రేమిస్తున్నామని.. పెళ్లి చేసుకుంటామని లైంగిక వేధింపులకు గురిచేశారు. ఈక్రమంలో 2019 జనవరి 1న తమ నానమ్మతో కలిసి ఫొటో దిగడానికి అక్కాచెల్లెలు పెగడపల్లి డబ్బాల సమీపాన గల ఓ ఫొటో స్టూడియోకు వెళ్లారు. అక్కడ అక్కాచెల్లెలను గమనించిన ఇద్దరు నిందితులు 'నీ స్నేహితురాలు పిలుస్తుంది' అని మాయమాటలు చెప్పి ఆటలో తీసుకుని పారిపోయారు. తమను ప్రేమించాలని దాడి చేస్తూ నగరం మొత్తం తిప్పి చివరకు ఇంటికి వెళ్లండని ఓ ప్రాంతంలో దింపారు. దీంతో అక్కాచెల్లెలు అక్కడి నుంచి నేరుగా గుండ్లసింగారం బొడ్రాయి వద్దకు చేరుకోగా నిందితులు వారి వెనుక వెళ్లి బాలికలను కొట్టారు. ఈ ఘటనలో చెల్లి స్పృహ తప్పి పడిపోగా .. అక్క కేకలు వేసింది. దీంతో నిందితులు పారిపోయారు. అనంతరం బాలికలు తెలిసిన వ్యక్తికి ఫోన్‌ చేయగా ఆయన ద్వారా సమాచారం తెలుసుకున్న బాధిత బాలికల తండ్రి ఘటనాస్థలికి చేరుకుని కుమార్తెలను ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను విచారించిన కోర్టు.. నేరం రుజువు కావడంతో నేరస్తులు సోనుసింగ్‌ బాటియా, ఎండీ సమీర్‌కు 3 సంత్సరాల జైలు శిక్ష, రూ. 2 వేల చొప్పన జరిమానా విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పునిచ్చారు. అప్పటి హనుమకొండ ఏసీపీ డి. చంద్రయ్య, కేయూ ప్రస్తుత సీఐ సంజీవ్‌ కేసు పరిశోధించారు. మహిళా ఏఎస్సై పరమేశ్వరి, భరోసా కేంద్రం లీగల్‌ ఆఫీసర్‌ సీహెచ్‌ నిరజ పర్యవేక్షణలో కే.రాజేందర్‌, డి. భాస్కర్‌ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

కారు ఢీకొని స్కూల్‌ బస్సు బోల్తా



ఘటనా స్థలంలో బోల్తా పడిన స్కూల్‌ బస్సు, పక్కన నుజ్జునుజ్జయిన కారు



గాయపడిన విద్యార్థిని తమ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



ఘటనాస్థలిలో గుమిగూడిన ప్రజలను పంపిస్తున్న పోలీసులు

- ప్రమాద సమయంలో బస్సులో 30మంది విద్యార్థులు
- ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు
- కారులో ప్రయాణిస్తున్న ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

కమలాపూర్‌: అతివేగంగా వస్తున్న ఓ కారు ఢీకొని స్కూల్‌ బస్సు బోల్తా పడింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో పరకాల–హుజూరాబాద్‌ ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. సీఐ హరికృష్ణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం పెంబర్తిలోని ఏకశిల స్కూల్‌కు చెందిన బస్సు పాఠశాల ముగిశాక గురువారం సాయంత్రం విద్యార్థులను ఇళ్ల వద్ద దింపడానికి బయలు దేరింది. కమలాపూర్‌ మండలంలోని కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాలకు వెళ్తోంది. ఈక్రమంలో కమలాపూర్‌ శివారులోని ఉమామహేశ్వర ఫంక్షన్‌ హాల్‌ వద్ద కన్నూరుకు వెళ్లేందుకు యూటర్న్‌ తీసుకుంటోంది. ఈ క్రమంలో బస్సు వెనకాలే అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో స్కూల్‌ బస్సు బోల్తా పడగా కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో స్కూల్‌ బస్సులో కన్నూరు, రాములపల్లి, భీంపల్లి గ్రామాలకు చెందిన 30మంది విద్యార్థులు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అద్దాలు పగులగొట్టి విద్యార్థులను బస్సులోంచి కిందకు దింపేశారు. ఈ ప్రమాదంలో స్కూల్‌ బస్సులోని ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు, కారులో ప్రయాణిస్తున్న హుజూరాబాద్‌కు చెందిన ఎండీ.అబ్దుల్‌, భవానందస్వామి, కరీంనగర్‌కు చెందిన సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న సీఐ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను పోలీస్‌ వాహనంలో, తీవ్ర గాయాలైన క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్‌ సాయంతో కారు, స్కూల్‌ బస్సును రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ క్లియర్‌ చేశారు. కారు కరీంనగర్‌ జిల్లా సైదాపూర్‌ మండలం బోర్నపల్లికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. అయితే, కారులో ప్రయాణిస్తూ తీవ్రంగా గాయపడిన ఎండీ.అబ్దుల్‌ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందగా.. అపస్మారక స్థితిలో ఉన్న సంతోష్‌ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ ప్రమాదంలో విద్యార్థులకు ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

'గ్రేటర్‌'కు కొత్త మాస్టర్‌ప్లాన్‌

కార్పొరేషన్‌ కార్యాలయానికి నూతన భవనం

- సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి జిల్లా సమస్యలు
- అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

హన్మకొండ అర్బన్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో రూపొందించిన గ్రేటర్‌ వరంగల్‌ మాస్టర్‌ప్లాన్‌తో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నందున గ్రేటర్‌ సమగ్ర అభివృద్ధికి సర్వే చేయించి కొత్త మాస్టర్‌ప్లాన్‌ సిద్ధం చేస్తామని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలు, ఆయన దృష్టికి తీసుకురానున్న ముఖ్య సమస్యలపై మేయర్‌ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌ రెడ్డి, కేఆర్‌ నాగరాజుతో కలిసి హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ పెద్దలు గ్రేటర్‌ వరంగల్‌ మాస్టర్‌ ప్లాన్‌ను అడ్డగోలుగా చేశారని విమర్శించారు. అందుకే రీ సర్వే చేయించి అందరికీ ఆమోద యోగ్యమైన మాస్టర్‌ప్లాన్‌ సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా సీఎం సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌ పనులు పరిశీలిస్తారని తెలిపారు. 12 అంతస్తుల వరకే ఆస్పత్రి ఉండాలని నిబంధనలు చెబుతున్నాయని, మిగిలిన భవనం అంతస్తులు ఏ విధంగా ఉపయోగించాలనే విషయం సీఎంతో చర్చిస్తామని తెలిపారు. జిల్లాలో ఆయుర్వేద కళాశాల, బస్టాండ్‌ అభివృద్ధికి నిధులు, హైదరాబాద్‌–వరంగల్‌ ఇండస్ట్రియల్‌ కారిడార్‌ ఏర్పాటు వంటి అంశాలు సీఎంకు వివరిస్తామని చెప్పారు. ఇన్నర్‌, ఔటర్‌ రింగ్‌రోడ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొన్నిచోట్ల పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేయిస్తామని తెలిపారు. పర్యాటకరంగం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందిర మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా సీఎం చేతుల మీదుగా మహిళలకు రూ.20 కోట్ల చెక్కు అందజేస్తామని మంత్రి సురేఖ తెలిపారు.

మంత్రి మాట్లాడుతుండగా కరెంట్‌ కట్‌

సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు వివరించేందుకు గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో మంత్రి మాట్లాడుతుండగా రెండు సార్లు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయంలో సాయంత్రం విద్యుత్‌ అధికారులు మంత్రిని కలిసి వివరణ ఇవ్వడంతోపాటు ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో టెస్టింగ్‌ చేస్తుండగా అంతరాయం ఏర్పడిందని, ఎలాంటి పవర్‌కట్‌ లేదని తెలిపారు.

దయాకర్‌రావు రాడు..రానివ్వం..

విలేకరుల సమావేశంలో మంత్రి సురేఖ మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్‌ పార్టీలోకి వచ్చే అవకాశం లేదని, ఒకవేళ ప్రయత్నం చేసినా తాము రానివ్వబోమని తెలిపారు. సమావేశంలో పలువురు విలేకరులు ఎర్రబెల్లి కాంగ్రెస్‌ పార్టీలో చేరికపై అడిగిన ప్రశ్నలకు ఆమె పై విధంగా సమాధానం ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఈ విషయంలో స్పష్టంగా ఉన్నారని, మిగతా వారి విషయం వేరు.. దయాకర్‌రావు విషయం వేరని చెప్పుకొచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి సురేఖ, పక్కన మేయర్‌ సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు

భార్యను చంపిన భర్త అరెస్ట్‌

భూపాలపల్లి అర్బన్‌ : భార్యను హత్య చేసిన భర్తను అరెస్ట్‌ చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్‌ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. నాలుగు రోజుల క్రితం ఫకీర్‌గడ్డ సమీపంలోని ఆకుదారివాడకు చెందిన ఇస్లావత్‌ సుమతిని తన భర్త హతిరామ్‌ హత్య చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సుమతిపై ఉన్న బంగారాన్ని బాత్రూం పక్కన గోతి తీసి అందులో దాచిపెట్టి, గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తన భార్యను చంపినట్లు హతిరామ్‌ తెలిపాడు. దీనిపై మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా హతిరామే.. భార్యను చున్నిని మెడకు బిగించి హత్య చేసినట్లు వెల్లడైందన్నారు. దీంతో హతిరామ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని సీఐ నరేశ్‌కుమార్‌ తెలిపారు.